# భక్తాగ్రేసరుడు

(ఒక అభూత కల్పన)

యవ్వనమంతా విషయవాంఛల్లో గడిపిన భోగి నడివయస్సులో తన దృష్టి భగవంతుడిమీదికి మళ్లించి భక్తుడైనాడు. భక్ష్యభోజ్యపానీయాలూ, స్త్రీలూ ఆనందంలో కొత్త అనుభవం యిచ్చే ఆశ తీరిపోగానే భోగి భక్తుడుగా పరిణమించాడు.

ఐహిక సుఖాలు తననింకా ఏమాత్రమో ఆకర్షిస్తూ ఉండటం గ్రహించ భక్తుడు వాటిని తీవ్రంగా నిరసించసాగాడు.

భక్తిలో అతనికి నిజమైన ఆనందం కనిపించకకాదు. కనిపించింది. అపారంగా కనిపించింది.

నువ్వుల్లోనించి వచ్చే నూనెకు అంతున్నది. ఇసుకలోనించి వచ్చే తైలానికి అంతేలేదు. కవిగాడన్నట్టు వినపడే సంగీతం మధురంగా ఉంటుంది; వినిపించని సంగీతం మధురతరంగా ఉంటుంది.

బయటినుంచి లోపలికి పొయ్యే ఆనందానికి మేర ఉంటుంది; లోపలినుంచి బయటకొచ్చే ఆనందానికి మేరలేదు.

రైతులు సేద్యం చేస్తున్నారు. రాళ్ల వాళ్లు రాళ్లు పగలగొట్టుతున్నారు. సాలెవాళ్లు బట్టలు నేస్తున్నారు. పాకీవాళ్లు రోడ్లు చిమ్ముతున్నారు. ఆడవాళ్లు పిల్లల్ని కంటున్నారు. భోగి మాత్రం భక్తుడైనాడు.

ఇతర ప్రపంచం తుచ్ఛజీవితంలో, శ్లేష్మంలో ఈగలాగా పడి కొట్టుకుంటుంటే భక్తుడు ఆత్మసంతృప్తి చెందగలిగాడు.

కాని భక్తుడికి భక్తివల్ల కలిగే ఆనందం చాలలేదు. మొదట ఏకైకత్వంగా కనిపించినది రానురాను ఏకాకిత్వంగా కనిపించసాగింది.

అందుకని భక్తుడు భక్తి ప్రచారం ప్రారంభించాడు.

"ఈ తుచ్ఛ సుఖాల్లో పడి ఎంతకాలం కొట్టుకుంటారు? వీటిని విసర్జించండి! తారకమైన హరిపద సేవ చెయ్యండి! ఈ సుఖాలు హరినామ కీర్తనకు సాటిరావు! ఇవి మిమ్మల్ని ఉద్ధరించలేవు!" అని ప్రచారం చెయ్యసాగాడు భక్తుడు.

భక్తుడి భక్తి పారవశ్యం అందరినీ ఆకర్షించింది. అందరినీ నమ్మించింది.

విషయలంపటులైన వారంతా భక్తుణ్ని చూసి ఒక నిట్టూర్పు విడిచారు. “ఆహా! ఎంత ధన్యుడు! ఇంద్రియావాంఛలను ఎట్లా జయించాడు? మనబోటి మానవమాత్రులకు ఆ విముక్తి సాధ్యం కాదు కద! ఆయనతో పోలిస్తే మనం ఎంత పశుతుల్యాంలం!” అనుకున్నారు వారు. ఈ ఆత్మవిమర్శతో పవిత్రాత్ములైనవారై, తమ ఆత్మలను తిరిగి మకిలపరచుకోవటం కోసం విషయవాంఛలవంక తిరిగారు – నీళ్లల్లో పరిశుభ్రమై వచ్చిన కుక్క ఆనందంగా రోడ్డుమీద పొర్లినట్టు.

“ఈ తుచ్ఛ సుఖాల్లో పడి ఎంతకాలం కొట్టుకుంటారు? వీటిని విసర్జించండి! తారకమైన హరిపదసేవ చెయ్యండి! ఈ సుఖాలు హరినామ కీర్తనకు సాటిరావు! ఇవి మిమ్మల్ని ఉద్ధరించలేవు!” అని ఉద్బోధించటం మానలేదు భక్తుడు.

ఈ మాటలు విని విద్యాధికులూ, సంస్కారులూ రసగ్రహణం చేసి వెళ్లిపోయినారు. కాని విద్యాహీనులకు భక్తుడి మాటల్లో ఒక పిలుపూ, ఒక ఉద్బోధమూ, ఒక ఆజ్ఞా వినిపించినై.

రైతు నాగలి వదలిపెట్టాడు. రాళ్లవాడు సుత్తె అవతల పారేశాడు. సాలెవాడు మగ్గం ముందునించి లేచాడు. పాకీవాడు చీపురు వదిలేశాడు. అందరూ భక్తుడిచుట్టూ చేరి భజన చెయ్యసాగారు.

ఆడది మాత్రం పురిటి కెదురుచూస్తూ ఉండిపోవలసి వచ్చింది.

పొలం దున్నటంలో ఉన్న ఆనందమూ, రాళ్లు పగలగొట్టటంలో ఉన్న సుఖమూ, రోజల్లా మగ్గం నెయ్యటంలో ఉన్న తృప్తీ, రోడ్లూడవటంలో ఉన్న పారవశ్యమూ వదులుకుని భక్తులంతా తన చుట్టూ మూగినందుకు భక్తుడు సంతోషించాడు.

“ఇవి మిమ్మల్ని ఉద్ధరించలేవు!” అన్న సత్యాన్ని తమకు తెలియజేసినందుకు రైతూ, రాళ్లు కొట్టేవాడూ, సాలెవాడూ, పాకీవాడూ సంతోషించారు. వారు చదువుకున్నవారైతే ఆ విషయం వారికదివరకే తెలిసి ఉండును.

ఇతర భక్తుల్ని తన శిష్యులు చేసుకుని భక్తుడు భక్తాగ్రేసరుడయినాడు.

ఆయనకూ, ఆయన భక్తులకూ ఎక్కడికి వెళ్లినా గొప్ప సత్కారం జరుగుతున్నది.

ఆయన ఖ్యాతి నలుదిక్కులా వ్యాపించింది.

కర్మ పరిపాకం చాలక ఇంకా తమ వృత్తులలోనే ఉంటున్న రైతు, కంసాలి, సాలె, పాకీజనం మూలంగా భకాగ్రేసరుడి జీవితానికీ, భక్తుల జీవితానికీ ఏ విధమైన కొదువా లేకపోయింది.

తమ వృత్తులను విడిచిపెట్టి హరిపద ధ్యానం అవలంబించిన వారికి జీవితం ఇప్పుడు సుఖమయంగా ఉంది.

ఈ సంగతి గమనించి ఇతరులు కూడా ఈ భక్తమతంలో చేరటానికి తండోపతండాలుగా వచ్చి భక్తాగ్రేసరుణ్ని ఆశ్రయించసాగారు.

భూస్వాముల పొలాలు పాడుపడినై. పెట్టుబడిదార్ల పరిశ్రమలు మూలబడినై.

"ఇది దారుణంఘా ఉంది. ఇట్లా అయితే జరగదు" అన్నారు పెద్దలు.

"ఈ పాములకి మనం చేజేతులా పాలుపోసి పెంచాం" అన్నారు పెద్దలు.

"వీటిని మారణహోమం చెయ్యకపోతే ప్రపంచం తలక్రిందైపోతుంది" అన్నారు పెద్దలు.

"ఈ భక్తాగ్రేసరుడు మారువేషంలో తరిగుతున్న విప్లవకారుడు, రాజద్రోహి. ఇతను చేస్తున్నది సాంఘిక విప్లవం!" అన్నారు రాజకీయవేత్తలు.

"ఇతను చెబుతున్నదంతా శాస్త్రీయంగా అసత్యం" అన్నారు వైద్యులు. "హరిజన మిఠాయి తింటే అన్నమెందుకు? హరినామ పానకం తాగితే మంచినీళ్లెందుకు?" అని చెబుతున్నారు భక్తాగ్రేసరుడు. "మిఠాయి తింటే జబ్బుచేస్తుంది. పానకం తాగితే దాహం తీరదు. ఈ ప్రచారం ఆరోగ్యసూత్రాలకు విరుద్ధంగా ఉంది!" అన్నారు వైద్యులు.

భక్తాగ్రేసరుడు రాజద్రోహిగా, దేశద్రోహిగా నిర్ణయించబడ్డాడు. అతన్నీ అతని అనుచరులనూ కారాగృహంలో ఉంచి, ఒక రాత్రి రహస్యంగా అదర్నీ చిత్రవధ చేశారు.

ప్రభుత్వం చేసిన ఈ పనిని జనులంతా గర్హించారు. ఈ విధంగా ఒక ఊరూ పేరూ లేని ప్రభుత్వం చరిత్రలో ఒక స్థానం పొందింది.

జనులంతా భక్తాగ్రేసరుడిమీద కథలు అల్లారు. అతనికి ఒక విగ్రహం వేశారు. అతను చచ్చినరోజు పండుగ చేసుకున్నారు. అతని సంకీర్తనలన్నీ పుస్తకరూపంగా వేసి చౌకగా అమ్మి చాలాలాభాలు సంపాదించి కొందరు మేడలు కట్టుకున్నారు. అతని చరిత్ర చిత్రాలుగా తీసి లక్షలు దోచుకున్నారు.

భక్తాగ్రేసరుణ్ని ఎట్లా ఉపయోగించుకోవాలో లోకానికి తెలిసివచ్చింది.

***ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942***

***యువ కార్యాలయం, తెనాలి***